తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ శుక్రవారం 02 - 10 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 2

## భర్తను కోల్పోయిన ఆడబిడ్డకు అండగా ఆరెగూడెం గ్రామస్తులు



ప్రజావారధి/మోత్కూరు

భర్తను కోల్పోయిన ఆడబిడ్డను గ్రామస్తులు అండగా నిలిచారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన ఎడ్ల శేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడు శేఖర్ భార్య నవ్య స్వగ్రామం మున్సిపల్ పరిధిలోని ఆరెగూడెం గ్రామస్తులు ఆ కుటుంబానికి భరోసాగా నిలిచారు. ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతుండటంతో స్పందించిన గ్రామస్తులు తలా కొంత వేసుకుని సేకరించిన రూ.55,600 ఆర్థిక సాయాన్ని గురువారం ఆ కుటుంబానికి అందజేశారు. శేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి భార్యాపిల్లలకు మనోధైర్యం కల్పించారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలవడాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి, కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు బద్దం నాగార్జున రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపాలిటీ ప్రధానకార్యదర్శి గజ్జి మల్లేష్, నాగుల నరేష్, మహిళా సంఘం సభ్యులు కన్నెబోయిన కోమలత, బద్దం సంధ్యారాణి, చేకూరి రాజేశ్వరి, హనుమకొండ హేమలత, అన్నెపు మమత తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవతో ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు దోహదం




ప్రజావారధి/మోత్కూరు

విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు దోహదపడుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రవీందర్ అన్నారు. మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మైభారత్ స్వచ్ఛపక్వాడ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనడంతో సమాజం పట్ల అవగాహన పెరుగుతుందని, బాధ్యత కలిగిన పౌరునిగా తమ జీవితాలను తీర్చిదిద్దుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మై భారత్ స్వచ్ఛంద కార్యకర్త హనుమకొండ వేణు, కళాశాల లెక్చరర్లు ఎం.పరుశరాములు, సిహెచ్.లింగ స్వామి, ఎం.సతీష్, సిహెచ్.అంజయ్య, ఎ.హరికృష్ణ, వి.లావణ్య తదితరులు పాల్గొన్నారు. శ్రమదానం చేసి కళాశాల ఆవరణను పరిశుభ్రం చేశారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు.

తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
శుక్రవారం
జనరల్ న్యూస్
02 - 10 - 2026


# రూ.15 కోట్లకు మళ్లీ టెండర్ నోటిఫికేషన్

## ముచ్చటగా మూడోసారి నోటిఫికేషన్ వేసిన అధికారులు




- ఇప్పటికే రెండుసార్లు రద్దు
- మున్సిపల్ కమిషనర్‌కు మెమో ఇచ్చిన సీడీఎంఏ
- నిధులపై ఎమ్మెల్యే సామేల్, కౌన్సిలర్ల మధ్య వివాదం
- మున్సిపల్ ఎన్నికలకు ముందు మోత్కూరు మున్సిపాలిటీకి రూ.15 కోట్ల నిధులు మంజూరు
- మూడోసారి టెండర్ రద్దయితే నిధులు ఉంటాయా..పోతాయా..?

ప్రజావారధి/మోత్కూరు
మోత్కూరు మున్సిపాలిటీలో రద్దవుతూ వస్తున్న రూ.15 కోట్ల పనులకు మున్సిపల్ అధికారులు మళ్లీ టెండర్ నోటిఫికేషన్ వేశారు. ఇప్పటికే రెండుసార్లు వేసిన టెండర్ నోటిఫికేషన్ రద్దవగా, ముచ్చటగా మూడోసారి టెండర్ పిలిచారు. రూ.15 కోట్లకు గాను రూ.11 కోట్ల 63 లక్షల 22277 నిధులతో చేపట్టే పనులకు గత నెల 24న సింగిల్ టెండర్ నోటిఫికేషన్ వేశారు. ఈనెల 3న సాయంత్రం 4.30తో టెండర్ గడువు ముగియనుంది. మున్సిపల్ ఎన్నికలకు ముందు మొదటగా వేసిన టెండర్‌ను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అనుచరుడు సింగిల్ టెండర్‌తో పనులను దక్కించుకోవడం, తమకు చెప్పకుండా టెండర్ నోటిఫికేషన్ ఎలా వేస్తారని మార్చి చివరలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఐదుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మెజార్టీ 8 మంది సభ్యులు వ్యతిరేకించి తీర్మానం చేయడంతో ఆ టెండర్ రద్దయ్యింది. రెండోసారి జూన్ 29న తిరిగి నోటిఫికేషన్ వేయగా జూలై 6 చివరి తేది వరకు ఒక్క టెండర్ కూడా దాఖలు కాకపోవడంతో అది కూడా రద్దయ్యింది. ప్రస్తుతం మూడోసారి టెండర్ పిలువడంతో అదైనా ముందుకు పడుతుందా లేదా అన్నది చూడాలి. కాగా టెండర్ నోటిఫికేషన్లు వేయడం, రద్దవడం, ఎందుకు పూర్తి చేయడం లేదన్న దానిపై సీడీఎంఏ మున్సిపల్ కమిషనర్ నర్సయ్యకు మెమో ఇచ్చినట్టు తెలిసింది.

| | |
|---|---|
| E1/MCM/19/2025-26 | |
| Name of Work | |
| Laying of BT roads various wards in Mothkur Municipality,Laying of CC roads in various wards in Mothkur Municipality, Construction of Dr B.R. Ambedkar, Bapu Jagjeevan Ram Study circles, construction of compound wall at Govt. Jr. College, Library and Dumping yard and Development of junctions, parks and Beautification in Mothkur Municipality Under Nagarabhivrudhi Funds-2nd call | |
| Tender Category | |
| Works | |
| Tender Type | |
| OPEN | |
| Estimated Contract Value | |
| 116322277.00 | |

### నిధులపై ఎమ్మెల్యే సామేల్, కౌన్సిలర్ల మధ్య వివాదం

మున్సిపల్ ఎన్నికలకు ముందు మోత్కూరు మున్సిపాలిటీకి మంజూరైన రూ.15 కోట్ల నిధులపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, కాంగ్రెస్ కౌన్సిలర్ల మధ్య తీవ్ర వివాదం నెలకొంది. ఎమ్మెల్యే సామేల్ తమకు చెప్పకుండానే ఏకపక్షంగా పనులను ఖరారు చేయడంపై కౌన్సిలర్లు అభ్యంతరం చెబుతున్నారు. రూ.15 కోట్ల నిధులతో తమ వార్డుల్లో మురికి కాల్వలు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన పనులు చేపడతామని హామీ ఇచ్చామని, తమకు ఏమాత్రం చెప్పకుండా టెండర్లు వేయడంపై ఎమ్మెల్యే, కౌన్సిలర్ల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. అందులో ప్రతిపాదించిన కొన్ని పనులు ప్రజావసరాలకు అనుగుణంగా లేవని కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పనులవారీగా విభజించి టెండర్లు వేయకుండా గంప గుప్తగా పెద్ద మొత్తంలో నిధులకు ఒకే టెండర్ పిలువడమేమిటని, ఒక్క కాంట్రాక్టర్‌కే ఇస్తే పనులు చేయడంలో కూడా ఆలస్యమవుతుందని, పనులను విభజించి టెండర్లు వేస్తే పనులు త్వరగా పూర్తయ్యే అవకాశముంటుందన్నారు. ఎమ్మెల్యే సామేల్, కౌన్సిలర్ల మధ్య విభేదాలతో టెండర్లు వేసి ఇబ్బందులు పడటమెందుకని కాంట్రాక్టర్లు కూడా టెండర్ వేయడానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మూడోసారి పిలిచిన టెండర్ అయినా ముందుకు పడుతుందా లేక మూడుసార్లు టెండర్ రద్దయి నిధులు వెనక్కి వెళ్లిపోతాయా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈనెల 3న సాయంత్రం 4.30తో టెండర్ వేసే సమయం ముగిస్తే గానీ ఆ నిధులపై ఓ క్లారిటీ వచ్చే అవకాశముంది.

| Tender Dates |
|---|
| Bid Submission Start Date & Time |
| 24/09/2026 04:45 PM |
| Bid Submission Closing Date & Time |
| 03/10/2026 04:30 PM |
| Bid Validity Period (in Days) |
| 120 |